# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 01 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సన్ రైజర్స్ ఆరోపణలు అవాస్తవం

- **హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఐపీఎల్ మ్యాచ్ పాస్ ల కోసం తమను ఒత్తిడి చేస్తోందంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని సన్ రైజర్స్ తన ఈ-మెయిల్ లో పేర్కొంది. ఉప్పల్ స్టేడియంలో ఓ మ్యాచ్ సందర్భంగా వీఐపీ బాక్స్ కు తాళం వేసుకున్నారని వెల్లడించింది. ఈ నేపథ్యంలో, సన్ రైజర్స్ ఆరోపణలపై హెచ్‌సీఏ స్పందించింది. ఈ నెల 29న ఈ-మెయిల్ ద్వారా సన్ రైజర్స్ ఆరోపణలకు సమాధానం ఇచ్చామని వెల్లడించింది. సన్ రైజర్స్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు వ్యక్తిగతంగా టికెట్లు అడగలేదని, కేవలం క్లబ్ కార్యదర్శుల కోసమే టికెట్లు అడిగారని వివరణ ఇచ్చింది.

## హైదరాబాద్‌లో
# వాన్‌గార్డ్ జీసీసీ



- **ఏఐ, డేటా అనాలసిస్, మొబైల్ టెక్నాలజీ సెంటర్**
- **ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం**
- **నాలుగేండ్లలో 2,300 ఉద్యోగావకాశాలు**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వాన్‌గార్డ్ ప్రతినిధి బృందం సమావేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచంలోని ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'వాన్‌గార్డ్' హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వాన్‌గార్డ్ మన దేశంలో నెలకొల్పే తొలి జీసీసీ ఇదే కావటం విశేషం. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో వాన్‌గార్డ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది.

Vanguard Group సీఈఓ సలీం రాంజీ, ఐటీ డివిజన్ సీఐఓ, ఎండీ నితిన్ టాండన్ , చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్ గారు, జీసీసీ – వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్ గారి నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఉన్నారు. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో జీసీసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు వాన్‌గార్డ్ తెలిపింది. రాబోయే 4 సంవత్సరాల్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. వాన్‌గార్డ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులతో నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు సేవలు అందిస్తోంది. హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ ఏర్పాటు చేసే కేంద్రం ఇన్నోవేషన్? హబ్‌గా పనిచేయనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో అందుకు అవసరమైన ఇంజనీర్లను తక్షణమే నియమించుకోవాలని ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుకు వాన్‌గార్డ్ ముందుకు రావటం సంతోషకరమైన పరిణామంగా ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. %uవశ్రీఖఅస్త్రుఱఖక్ష్మఱంఱఅస్త్ర% విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీ గమ్య స్థానంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని అన్నారు. మన దేశంలోని ప్రతిభను ఉపయోగించుకోవడానికి, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని వివరించారు. జీసీసీ నెలకొల్పడానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తుందని కంపెనీ ప్రతినిధులకు ముఖ్యమంత్రి గారు భరోసా ఇచ్చారు. వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు హైదరాబాద్ అనుకూలమైన వాతావరణం కలిగి ఉందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. వీటికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో హైదరాబాద్‌ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామని తెలిపారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లను అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందన్నారు.

# హెచ్‌సీయూలో కొనసాగుతున్న ఉద్రిక్తత



- **కొనసాగుతున్న భూమి చదును పనులు**
- **వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు**
- **భారీగా బలగాల మోహరింపు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్రిక్తత కొనసాగుతోంది. విద్యార్థుల ఉద్యమిస్తుండడంతో భారీగా పోలీసు బలగాలు యూనివర్సిటీలో మోహరించాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో ప్రభుత్వ నిర్ణయాన్ని యూనివర్సిటీ విద్యార్థులు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి టీచింగ్ నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టారు. యూనివర్సిటీలో వరుసగా ఆందోళనలు చేశారు. ఇదే క్రమంలో అసెంబ్లీలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి ఈ భూముల వేలంపై ప్రకటన చేశారు. ఈ క్రమంలో విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం రాత్రి విద్యార్థులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే క్రమంలో కొందరు విద్యార్థులు గాయపడ్డారు. ఇదిలా ఉంటే ఆదివారం ప్రభుత్వ యంత్రాంగం.. జేసీబీలు, ట్రక్కులు తీసుకుని పోలీసు బలగాల మధ్య యూనివర్సిటీలోకి వచ్చి సదరు భూమిని చదును చేసింది. దీన్ని విద్యార్థులు అడ్డుకొని తీవ్రంగా ప్రతిఘటించారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పీహెచ్‌డీ విద్యార్థులు ఎర్రం నవీన్‌కుమార్, డాక్టర్ రోహిత్‌పై 329(3), 118(1), 132, 191(3), 351(3) ఆర్/డబ్ల్యూ3(5) కేసులు నమోదు చేశారు.

విద్యార్థుల అరెస్టు.. వారిపై పోలీసుల జులుంను ఖండిస్తూ.. ఆదివారం అర్ధరాత్రి యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనలు కొనసాగించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమండ్ చేస్తూ పెద్దఎత్తున విద్యార్థు లకు హాస్టల్స్ నుంచి బయటకు వచ్చి ఆందోళనలు చేపట్టారు. రాత్రంతా ఆందోళనను కొనసాగించారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోమవారం ఉదయం యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ప్రధాన గేట్లకు తాళాలు వేసి వేలాదిగా పోలీసులు కాపలా ఉన్నారు. విద్యార్థులు బయటకు, లోపలికి రాకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఒకవైపు విద్యార్థుల ఆందోళనలు కొనసాగు తుంటే.. మరో వైపు ప్రభుత్వం పోలీసు బందోబస్తు మధ్య జేసీబీల సాయంతో భూమి చదును చేపట్టింది. యూనివర్సిటీలో చెట్లను తొలగిస్తు న్నాయి. ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు చెట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది.

## వన్యప్రాణుల రోదనలు వినిపించడం లేదా రాహుల్ గాంధీ



- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బుల్డోజర్లు పెద్ద ఎత్తున హైదరాబాద్ యూనివర్సిటీలో మోహరించడంతో అక్కడే ఉన్న వన్యప్రాణులన్నీ అరుస్తున్నాయని.. అవి రాహుల్ గాంధీకి వినపడడం లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో ఆశువులు బాసిన అమరవీరుల త్యాగాల ఫలమే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం పడుతున్న ఆరాటం చాలా గొప్పది ఈమధ్య కొత్తతరం పిల్లల్లో విద్యార్థుల్లో పోరాట స్ఫూర్తి తగ్గిందని అప్పుడప్పుడు బాధపడతాం కానీ ఇలాంటి సరైన సందర్భంలో యూనివర్సిటీ విద్యార్థులు చూపెడు తున్న తెగువ, వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నాం ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా కొన్ని ప్రశ్నలను విద్యార్థుల తరపున పార్టీ తరపున అడుగుతున్నాము రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థుల పైన యూనివర్సిటీ భూముల పైన రాజకీయం చేస్తున్నది. వందల బుల్డోజర్లను, హిటాచి యంత్రాలను పెట్టి అక్కడున్న చెట్లను, జంతువులను, చంపి మరీ వేగంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నది ఎందుకు ఇంత వేగంగా భూముల కబ్జాకు ఆరాటపడుతున్నదో చెప్పాలి

గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాలో నగరం విస్తృతంగా పెరిగింది. ఒక కాంక్రీట్ జంగిల్‌గా మారింది. భారత దేశంలోని ఏ నగరంలో కూడా అంత తక్కువ విస్తీర్ణంలో భారీగా నగరం అభివృద్ధి చెందలేదు. కోట్లాది చదరపు అడుగుల నివాస గృహాలు నిర్మాణం అవుతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మరియు దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే పశ్చిమ హైదరాబాదులో భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది. సెంట్రల్ యూనివర్సిటీ చుట్టూ ఉన్న హరితాన్ని అలాగే ఉంచితే భవిష్యత్తుకు కొంత భరోసా ఉంటుంది ఒక ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అనేది చేయకుండా ఏ విధంగా ఈ 400 ఎకరాలు అమ్ముతారని విద్యార్థులు అడుగుతున్నారుఈ 400 ఎకరాలను అమ్మే ముందు జరిగే పర్యావరణ నష్టం ప్రభావం పైన అధ్యయనం చేయాలని అడుగుతున్నారు 2003లో ఐఎంజీ భారత అనే కంపెనీకి క్రీడా సదుపాయాల కోసం ఈ 400 ఎకరాలను కేటాయించింది. కేవలం స్టేడియాలు క్రీడా శిక్షణకు సంబంధించిన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వాలు భూములను ఆ సంస్థకు ఇచ్చింది కానీ ఈ ప్రభుత్వం అదే ప్రాంతంలో 400 ఎకరాలలో కోట్లాది చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టి కాంక్రీట్ జంగిల్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నదిఈ భూములపై మొన్నీమధ్యే 21 సంవత్సరాల తర్వాత కేసు తేలింది. కానీ ప్రభుత్వం మాత్రం వెంటనే ఆ భూములను అమ్మి రూ. 30 వేల కోట్ల రూపాయలను సేకరించాలని ప్రయత్నం చేస్తుందివంత్ రెడ్డి ఆస్తులు అమ్మడం, అప్పులు తేవడం అనే ఎజెండా పైన ఉన్నాడు. ఫ్యూచర్ సిటీ 50 వేల ఎకరాలలో కడతామని చెప్పి ప్రచారం చేసుకుంటున్నారు

ఫార్మాసిటీ భూములతో పాటు మరో 30 వేల ఎకరాలు సేకరించి నూతన నగరం కడతామంటున్నారు. ఇప్పటికే వేల ఎకరాల భూమి మీకు అందుబాటులో ఉన్నప్పుడు 45 వేల ఎకరాలను అమ్ముకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు. 45000 ఎకరాలు ప్రభుత్వానికి అందుబాటులో వచ్చే ఈ తరుణంలో 400 ఎకరాలపైన ఎందుకు ఇంత దారుణంగా దాష్టీకంగా వ్యవహరిస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అడ్డమొచ్చిన విద్యార్థులను, ఆడబిడ్డలను లాగి పడేసి దుస్తులను చించి మరీ దుశ్శాసనుడి మాదిరి వ్యవహరించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెగబడుతున్నది. అక్కడ బుల్డోజర్లు చేస్తున్న కార్యక్రమాలు, అక్కడ ఉన్న వన్య ప్రాణులు అరుస్తున్న విజువల్స్ మీకు కనిపిస్తలేదా రాహుల్ గాంధీ? హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపైన పర్యావరణహితం కోసం ప్రజా ప్రయోజన రాజ్యం వేయడం జరిగింది. అయితే ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల కన్నా ముందే అరాచకంగా వ్యవహరి స్తున్న తీరుపై ఎందుకు రాహుల్ గాంధీ స్పందించడం లేదు? గతంలో రాహుల్ గాంధీ సెంట్రల్ యూనివర్సిటీకి రెండుసార్లు వచ్చి వెళ్లారు, మరీ అలాంటిది విద్యార్థుల పైన ఇన్ని అరాచకాలు జరుగుతున్నా పర్యావరణంపైన ఇంత అక్రమంగా తమ సొంత ప్రభుత్వం వ్యవహరిస్తున్నా ఎందుకు స్పందించడం లేదు?ఇదే రాహుల్ గాంధీ గతంలో ముంబై ఆరాయి అడవులపైన జాతీయ స్థాయిలో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో హస్దేయో అడవులను ఇతరులకు కేటాయించకుండా రాహుల్ గాంధీ మాట్లాడారు.

మిగితా 2వ పేజీలో

## సన్ రైజర్స్ హెచ్‌సీఏ వివాదం.. విచారణకు సీఎం ఆదేశం

వివరాలు 2వ పేజీలో

## అరుణాచల్ ప్రదేశ్‌లో భూకంపం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అరుణాచల్ ప్రదేశ్ లో భూకంపం సంభవించింది. సోమవారం మధ్యాహ్నం 2:38 గంటల సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని షియోమి కేంద్రంగా భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. అయితే, భూ ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. భూమి ఒక్కసారిగా కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు.

## రాజీవ్ యువ వికాసం పథకం
### గడువు పొడగింపు

- **ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది, అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రజా భవన్ నుంచి ఆయన చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు అంతా మనసుపెట్టి పనిచేయాలని, నిరుద్యోగులకు సేవ చేసే భాగ్యం ఈ పథకం ద్వారా అధికారులకు కలుగుతుందని డిప్యూటీ సీఎం సూచించారు. దశాబ్ద కాలంగా నిరుద్యోగ యువతపై ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ నిధులు ఖర్చు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రాజెక్ట్ ఇది అని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకునేందుకు యువత కష్టపడ్డారు. చిన్న పొరపాటు వచ్చిన అధికారులు వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఈ పథకం ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యుఎస్ అన్ని వర్గాల గురించి ఆలోచించి మొదటిసారి చేస్తున్న స్వయం ఉపాధి పథకం ఇది అన్నారు. గతంలో మంజూరీ అయినా చివరి వరకు నిధులు విడుదల చేయలేదని అన్నారు. ధరఖాస్తుధారులు ఎంపీడీఓ కార్యాలయాలు, మునిసిపాలిటీలో నేరుగా ధరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మంత్రులు జిల్లాలకు వచ్చినప్పుడు పథకానికి సంబంధించిన ప్రగతి సమాచారం అందించి వారి నుంచి సలహాలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలకు పథకానికి సంబందించిన పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న అర్హులకు శాంక్షన్ లెటర్లు ఇవ్వాలని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక యువ అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

## 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే...

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై యాజమాన్య హక్కు తమదేనని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) వివరణ ఇచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చట్టపరంగా గెలవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని పేర్కొంది.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలోని 400 ఎకరాల భూమి విక్రయం వివాదాస్పదంగా మారడంతో తెలంగాణ ప్రభుత్వం ఈ కీలక ప్రకటన చేసింది. ఆ భూమి ప్రభుత్వానిదేనని క్లారిటీ ఇచ్చిన ప్రభుత్వం.. అందులో హెచ్‌సీయూ భూమి లేదని తేల్చి చెప్పింది. ఆ భూమికి తామే యజమానులమని కోర్టు ద్వారా నిరూపించుకున్నామని ప్రభుత్వం పేర్కొంది. 21 ఏళ్ల క్రితం ప్రైవేటు సంస్థకు కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వం తిరిగి పొందినట్టు పేర్కొంది. వేలం, అభివృద్ధి పనులు అక్కడ ఉన్న రాళ్లను ఏమీ చేయవని ప్రభుత్వం తెలిపింది. అభివృద్ధి కోసం ఇచ్చిన భూమిలో చెరువు లేదని స్పష్టం చేసింది. సర్వేలో ఆ భూమి హెచ్‌సీయూకు చెందినది కాదని తేలిందని పేర్కొంది. అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు (లేక్) లేదని.. సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా హెచ్‌సీయూది కాదని తేలిందని ప్రభుత్వం తెలిపింది.కొందరు కావాలనే విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రభుత్వం తెలిపింది.

"కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వేనంబర్ 25లో 400 ఎకరాల భూమిని 2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రయివేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. వారు ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో ఆ కేటాయింపును రద్దు చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ శాఖకు కేటాయించింది. దాంతో ఐఎంజీ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2024లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దాంతో ఐఎంజీ సుప్రీంకోర్టుకు వెళ్లింది.

మిగితా 2వ పేజీలో

## టీజీఐఐసీ ప్రకటనను ఖండించిన హెచ్‌సీయూ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీ ఇచ్చిన ప్రకటనను హెచ్‌సీయూ ఖండించింది. 400 ఎకరాల భూమిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి సర్వే నిర్వహించలేదని వెల్లడించింది. జూలై 2024లో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సర్వే జరిగిందన్న వార్తలను ఖండించింది. విశ్వవిద్యాలయం ప్రకటనలో, ఇప్పటివరకు భూమి స్థలాకృతిపై ప్రాథమిక తనిఖీ మాత్రమే జరిగిందని స్పష్టం చేసింది. టీజీఐఐసీ ఇటీవల హెచ్‌సీయూ భూమి సరిహద్దులు నిర్ణయించబడ్డాయి అని ప్రకటించగా, హెచ్‌సీయూ మాత్రం దీనిని ఖండించింది. తమ భూసరిహద్దులు ఇప్పటివరకు అధికారికంగా గుర్తించలేదని, విశ్వవిద్యాలయానికి ఎటువంటి అధికారిక సమాచారం అందించలేదని తెలిపింది.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమిని ఎటువంటి అన్యాక్రాంతాలకు గురిచేయకుండా చూడాలని కోరింది. హెచ్‌సీయూ ప్రకారం, ఈ భూమి ట్రాన్స్‌ఫర్ కావాలంటే, అది పూర్తిగా విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి ఆమోదంతో మాత్రమే జరగాలి. హెచ్‌సీయూ ఈ వివాదాన్ని పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ కోణంలో కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్ 1 తేదీ నుంచి మూడో తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఏప్రిల్ 4వ తేదీన వర్ష ప్రభావం తక్కువగా ఉంటుందని ఐఎండీ తెలిపింది. వర్షాల కారణంగా ఏప్రిల్ 2, 3 తేదీల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 3-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, వికారాబాద్ తదితర జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని తెపింది. పలుచోట్ల ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

## ఓఆర్‌ఆర్‌పై టోల్ ఛార్జీల పెంపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)పై టోల్ ఛార్జీ లను పెంచుతున్నట్లుగా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉండే ఓఆర్‌ఆర్ ను బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ 30 ఏళ్లకు లీజుకు గత ఏడాది తీసుకున్న విషయం విదితమే. అగ్రిమెంట్ ప్రకారం.. ప్రతి సంవత్సరం టోల్‌ఛార్జీలను పెంచుకునే వెసులుబాటును కూడా ఆ సంస్థకు కల్పించింది. ఈ మేరకు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పై టోల్ ఛార్జీలను పెంచుతున్నట్లుగా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. పెంచిన ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయి. కారు, జీపు, లైట్ మోటర్ వెహికల్స్‌కు కి.మీకు రూ.2.34 నుంచి రూ.2.44కు, ఇక మినీ బస్, ఎల్‌సీవీలకు కి.మీకు రూ.3.77 నుంచి రూ.3.94కు పెంచారు. అదేవిధంగా 2 యాక్సిల్ బస్సులకు కి.మీకు రూ.6.69 నుంచి రూ.7కు, హెవీ వెహికిల్స్‌కు కి.మీ. రూ.15.09 నుంచి రూ.15.78కి ఛార్జీలను పెంచుతూ ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ ప్రకటన విడుదల చేసింది.


## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..
### వరంగల్‌కి చెందిన మహిళా మావోయిస్టు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో నక్సలైట్లు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి చెందింది. మృతి చెందిన మావోయిస్టు వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్ చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలని.. దండకారణ్య స్పెషల్ జోన్‌లో కమిటీ సభ్యురాలిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆమె తలపై రూ.25లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీగా తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

బలగం టీవి, హైదరాబాద్



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఆరుగురు ఆచూకీ కోసం నిరంతరం సహాయక చర్యలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సోమవారం ఎస్ ఎల్ బి సి, టన్నెల్ లో కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాద ప్రదేశంలో నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు, కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణను వేగవంతం చేసి, సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో శివశంకర్ లోతేటి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తుందని ,ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా,సింగరేణి మైన్స్ రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లోను 24 గంటల పాటు శ్రమిస్తున్నరని వివరించారు. సహాయక బృందాలు, నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ, మైనింగ్ ప్రమాదాల్లో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ, వారి సలహాలు సూచనలు తీసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టన్నెల్ లో కన్వేయర్ బెల్ట్ ను 13630 మీటర్ల నుండి 13730 వరకు(వంద మీటర్లు) పునరుద్ధరిస్తున్నట్లు తద్వారా టన్నెల్ లోపల ఎస్కవేటర్ల సహాయంతో సొరంగం లోపల ఉన్న మట్టిని బయటికి తరలించడానికి పనులను కొనసాగిస్తున్నట్లు శివశంకర్ తెలిపారు. సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్య లో దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది టన్నెల్లోపల సహాయక చర్యలకు అడ్డంకిగా ఉన్న స్టీల్ను కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు వివరించారు. సొరంగంలోని ఊట నీటిని ప్రతిరోజు అత్యధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటికి పంపించేస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాలు ప్రతినిత్యం తమకు కేటాయించిన పనిని దిగ్విజయంగా పూర్తి చేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు.సహాయక సిబ్బంది పండుగలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొనడం అభినందనీయమని, వారి యొక్క స్ఫూర్తిని ప్రశంసించారు. మట్టి తవ్వకాలు కనుగుణంగా వెంటిలేషన్ పునరుద్ధరణ జరుగుతుందని, సహాయక సిబ్బందికి ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి, జె పి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ భూముల వేలం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

● ఎంపీ ఈటల రాజేందర్

బలగం టీవి, హైదరాబాద్



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియూ) విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హెచ్‌సియూ భూములు అమ్మి అప్పులు కట్టాలనే నీచమైన ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిన ప్రముఖ విశ్వవిద్యాలయంలో రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్శిటీ భూముల వేలాన్ని విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళుతోందని అన్నారు. హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చిందని అన్నారు. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతుందని అన్నారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో ప్రతి నిర్ణయం ప్రజాకటకం, ప్రజా వ్యతిరేకమైనదేనని తెలిపారు. విద్యార్థుల మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వారికి సంఘీభావం తెలుపుతున్నామని, అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఈటల హెచ్చరించారు. ఇకనైనా విశ్వవిద్యాలయం భూములు అమ్మకూడదని ఆయన డిమాండ్ చేశారు.

## 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ కూడా ఆ సంస్థకు చుక్కెదురైంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది.ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ 400 ఎకరాలు కేటాయిం చాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ భూమి హక్కులనుటీజీఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై 1న టీజీఐఐసీకి అప్పగించారు" అని వివరించింది. వాస్తవం ఈ విధంగా ఉంటే, కొన్ని మీడియాల్లో అటవీ భూమనీ, బఫెల్లో లేక్, పీకాక్ లేక్ ఉన్నాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. ఉమ్మడి సరిహద్దులకు సంబంధించి సహకరించాలని టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు 2024, జులై 04వ తేదీన లేఖ రాశారని తెలిపింది. వారి సమ్మతితోనే 2024, జులై 19న రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ధారించారని పేర్కొంది.

## సన్ రైజర్స్ హెచ్‌సీఏ వివాదం.. విచారణకు సీఎం ఆదేశం



బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ , సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం మధ్య నెలకొన్న వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఎస్ ఆర్ హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై సీరియస్ అయినట్టు తెలిసింది. ఈ అంశంపై ఇప్పటికే వివరాలు సేకరించిన సీఎం . దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ డిజి కొత్తకోటను ప్రభుత్వం కోరింది. దర్యాప్తు తర్వాత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ మేరకు సీఎంఓ కార్యాలయం మఖ్యమంత్రితో చర్చించింది. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల విషయంలో బెదిరించిన అంశంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

ఫ్రీ పాసుల కోసం తమను హెచ్‌సీఏ తమను వేధిస్తోందని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించింది. హైదరా బాద్‌ను వీడి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధి లేఖ రాశారు. హెచ్‌సీయూ అధ్యక్షుడు జగన్మోహనరావు ఫ్రీ టికెట్స్ కోసం తమను వేధిస్తున్నారంటూ లేఖలో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం పేర్కొంది. ఇప్పటికే పదిశాతం టికెట్లు ఇస్తున్నామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. టికెట్ల కోసం బెదిరిస్తూ మ్యాచ్‌కు ముందు.. కార్పొరేట్ బాక్స్‌లకు తాళం వేశారని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించింది. ఐపీఎల్ కోసం స్టేడియం అద్దె మొత్తం చెల్లిస్తున్నా.. హెచ్‌సీఏ పెత్తనం చేయాలని చూస్తోందని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అపెక్స్ కౌన్సిల్‌తో చర్చలకు ఏర్పాటు చేయాలని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కోరింది. చర్చలు సఫలం కాక పోతే బీసీసీఐతో చర్చించి వేదికను మార్చుకుంటామని కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ తేల్చిచెప్పింది.

## కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ప్రారంభం వాయిదా..

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ప్రారంభం వాయిదా పడింది. ఏప్రిల్ 1వ తేదీకి బదులు 3వ తేదీన ప్రారంభించాలని ఎక్సైజ్ అధికారులు తాజాగా నిర్ణయం తీసుకున్నారు. దీంతో గురువారం హైదరాబాద్‌లో 13, వరంగల్ అర్బన్‌లో ఒక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్‌లో 13, వరంగల్ రూరల్‌లో ఒక కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జీహెచ్ఎంసీ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం వాయిదా పడినట్లు సమాచారం. జీహెచ్ఎంసీలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అనుమతులు తీసుకున్న అనంతరం ఏప్రిల్ 3వ తేదీన కొత్త పోలీస్ స్టేషన్ల ప్రారంభానికి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి డివిజన్‌లోని గండిపేట కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను, సంగారెడ్డి పరిధిలో అమీన్‌పురా పోలీస్ స్టేషన్లను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఎం రిజ్వి, ఎక్సైజ్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఎక్సైజ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మిగిలిన ఎక్సైజ్ స్టేషన్లను ఆయా ప్రాంతాల్లోని అధికారుల ప్రారంభించనున్నారు.



## కొండ మైసమ్మ జాతరలో పాల్గొన్న ప్రభుత్వ విప్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

కొనరావుపేట మండల కేంద్రంలోని కొండ మైసమ్మ జాతర మహెూత్సవంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పచ్చి అబద్ధాలు అవే అర్థం లేని ఆరోపణలు

● ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

బలగం టీవీ, సూర్యాపేట



సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ భాషలో ఎలాంటి మార్పు రాలేదని, సీఎం అనే సోయిలేకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని అదే భాష అవే పదాలు.. ముఖ్యమంత్రి స్థాయి వచ్చిన మూర?త్వం మారడం లేదని పచ్చి అబద్ధాలు.. అవే అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 15 నెలలు గడిచినా కేసీఆర్ మాట లేకుండా సభ సాగట్లేదని సోనియాగాంధీ 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారు తప్ప రేవంత్ రెడ్డి మూర?త్వపు మాటలకు కాదని అన్నారు. కాళేశ్వరాన్ని కేసిఆర్ కు అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్లు ఇచ్చి చూపిస్తామని చెప్పిన ఎలాంటి స్పందన లేదని మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని పంట పొలాల వద్ద కన్నీరు పెడుతున్నరని, కడుపుమండిన రైతులు, మహిళలు ప్రభుత్వానికి, రేవంత్ కు శాపనార్థాలు పెడుతుంద్రని ప్రభుత్వం ఇస్తామన్న రుణమాఫీ లేదు రైతుబంధు లేదు బీమా లేదని ప్రతిదీ మభ్యపెట్టి మోసం చేశారని, బోనస్ ఇవ్వాల్సి వస్తుందని అసలు ధాన్యమే కొనడం లేదని ఉన్న ధాన్యం ఎంత అంటే ఎక్కడ సమాధానం లేదని ప్రతిపక్ష నాయకుల ఫోన్లను అధికారులు ఎత్తడమే లేదని వాన కాలంలో ఏ పంట ఎంత కొన్నారని దొడ్డు రకానికి బోనస్ ఇస్తామని మాటమార్చి సన్నధాన్యానికి బోనస్ అన్నారని అన్నారు.

ఎంత ధాన్యం కొన్నారు ఎంత బోనస్ ఇచ్చారు అంటే సమాధానం లేదని, నిన్న హుజుర్ నగర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే మూర?త్వాన్ని అజ్ఞానాన్ని ప్రదర్శించిండని మళ్ళీ కేసిఆర్ ను తిట్టడం తప్ప వేరే పని లేదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై విషం కక్కి ప్రజాక్షేత్రంలో బతకడం సాధ్యం కాదని ఇంకా మూడేళ్లు అధికారంలో ఉంటారని తెలిసికూడా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు భయపడకుండా ఎండగడుతున్నారని అన్నారు. నీ గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదు%ొ% కేసీఆర్ గురించి మాట్లాడనిదే నీకు పూట గడవదని పక్క దేశాలు చూడు ప్రజలు తిరుగబడితే ఎలా కూలిపోయాయో తెలుస్తుందని పద్ధతి భాష మార్చుకోవాలని రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గత ఏడాది కొన్న సన్న వడ్లు ఎన్ని.. ఇచ్చిన బోనస్ ఎంతో సమాధానం చెప్పాలని అన్నారు. రబీ ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి సమీక్షలు చేయలేదని, అసలు కొనుగోలు చేస్తారా లేదా తెలియదని నీళ్లు ఇవ్వమంటే రైతుల పొలాలు వేసుకోరని నేడు నీళ్ళు ఇస్తామని ఇవ్వకపోవడంతో వేలాది ఎకరాలు నష్టపోయారని, ఒక తడికి ఇస్తే వేలాది ఎకరాలు పెట్టుబడి అయినా వస్తుందని చివరి భూముల వరకు నీళ్లు ఇవ్వాలని ధాన్యం కొనుగోళ్లపై వెంటనే ఒక ప్రకటన చేయాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ నుంచి 9000 క్యూసెక్కుల నీరును పారించామని, కన్నెపల్లి పంప్ హౌస్ బాగానే ఉందని అధికారులు చెబుతున్నారని అయినా నడిపించే సోయి ప్రభుత్వానికి లేదని,NDSP ఒక సాకుతో కాళేశ్వరం నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని చంద్రబాబు నిబంధనలు తుంగలో తొక్కి నీళ్లు తీసుకుపోతుంటే ఇక్కడి ప్రభుత్వానికి సోయిలేదని, ఇకనైన రైతులు మేలుకోవాలని కాళేశ్వరం కొనసాగింపుకు మరో ఉద్యమం చేయాలని అన్నారు.

## వన్యప్రాణుల రోదనలు వినిపించడం లేదా రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ రోజు హైదరాబాద్ భవిష్యత్తును, పిల్లల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం పణంగా పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన మీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉండాల్సిన అవసరం లేదా రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల పైన చేస్తున్న రాజకీయం వలన ఇబ్బందులు పడుతున్న పిల్లలు ,పర్యావరణం, వన్యప్రాణుల రోదనలు మీకు వినిపించడం లేదా రాహుల్ గాంధీ?" అని ప్రశ్నించారు.

# వేములవాడ జనాభా కనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తాం..

**-రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు టెండర్ పూర్తి**

**-ప్రజలు, చిరు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, వేములవాడ:**

ప్రజలు,చిరు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా వేములవాడలో వీధి విక్రయ మార్కెట్ జోన్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.సోమవారం వేములవాడ పట్టణంలో 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న వీధి విక్రయ మార్కెట్ జోన్ పనులకు, 56 లక్షల 50 వేల రూపాయలతో పట్టణంలోని 11,12 వార్డుల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రజలకు అందుబాటులోకి బైపాస్ రోడ్డులో కూరగాయల మార్కెట్లో రూ. 80 లక్షలతో 68 కూరగాయల స్టాల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో ప్రజలు, మార్కెట్లో కూరగాయలు విక్రయిస్తున్న వారి కోరిక మేరకు నూతన నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు.వేములవాడలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు. అందులో భాగంగానే ప్రజల అవసరాలకు అనుగుణంగా దుకాణాల సముదాయాలు, మార్కెట్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. రూ.56 లక్షల తో సీసీ రోడ్ల సైడ్ డ్రైన్ ల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. వేములవాడ పట్టణంలో ఉన్న 28 వార్డుల్లో ప్రతి వార్డులో రూ. 10 లక్షలతో కనీస అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేపడతామని అన్నారు.

వేములవాడ పట్టణ ప్రజలతోపాటు రాజన్న భక్తులు సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న మూడో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. భూసేకరణకు రూ.6 కోట్ల నిధులు కేటాయించి కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు ప్రారంభించామని తెలిపారు. రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు చేయబోతున్నామని అన్నారు. రూ.76 కోట్లతో రాజన్న ఆలయ విస్తీర్ణకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని,రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని అన్నారు. గతంలో మళ్ళిపోయిన 20 కొట్ల వీటీడీఏ నిధులను తిరిగి తెప్పించి బద్ది పోచమ్మ ఆలయం వద్ద పనులను చేపడుతున్నామని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని త్వరలోనే ఆవిష్కరించబోతున్నామని,మూల వాగులో గుడి చెరువులో మురుగునీరు కలవకుండా ఇప్పటికే పనులు ప్రారంభించామని అన్నారు.రూ.1 కోటి 50 లక్షలతో బస్తీ దవాఖాన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, 80 లక్షలతో తిప్పాపూర్ వెళ్లే రోడ్డుకు ట్రాక్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి..

**-5వ తేదీలోగా కార్యాలయాల్లో అందజేయాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు లకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని తెలిపారు.

అర్హత మరియు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా OBMMS ఆన్లైన్ పోర్టల్ “%http://tgobmmsnew.cgg.gov.in%” ద్వారా దరఖాస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.అభ్యర్థులు, పూరించిన దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, హార్డ్ కాపీ, అవసరమైన పత్రాలను జత పరిచి మండల ప్రజాపాలన సేవా కేంద్రం (గ్రామీణ ప్రాంతాలలో MPDO కార్యాలయం) లేదా మున్సిపల్ కమిషనర్ (పట్టణ ప్రాంతాలు)లో సమర్పించాలని స్పష్టం చేశారు.

**అవసరమైన పత్రాలు..**

ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం (తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది),శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు), పట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ పథకాలకు),సదరం సర్టిఫికేట్ ( కోసం), పాస్‌పోర్ట్ సైజు ఫోటో, దుర్బల (బలహీన) సమూహ ధృవీకరణ పత్రం (మండల స్థాయి కమిటీ ధృవీకరించబడినది).

**ఆదాయ పరిమితి..**

గ్రామీణ ప్రాంతాలు: సంవత్సరానికి రూ.1,50,000/-. పట్టణ ప్రాంతాలు: సంవత్సరానికి రూ.2,00,000/- (మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు),రేషన్ కార్డు వివరాలను దరఖాస్తు ఫారంలో ఇవ్వాలి మరియు రేషన్ కార్డు అందుబాటులో లేని సందర్భాలలో మాత్రమే, అభ్యర్థులు “మీ–సేవ” జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.

**వయోపరిమితి:**

వ్యవసాయేతర పథకాలకు 21 - 55 సంవత్సరాలు (2024 సంవత్సరం జూలై 1 నాటికి).

వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 21 - 60 సంవత్సరాలు (2024 సంవత్సరంజూలై 1 నాటికి)

**నిధుల కేటాయింపు, యూనిట్ ధర, సబ్సిడీ,బ్యాంకు లోన్ ఎకనామిక్ సపోర్ట్ స్కీములు**

1) యూనిట్ ధర రూ.50,000/- వరకు
100%

2) యూనిట్ ధర రూ.50,001 నుండి రూ.1,00,000/- వరకు
90%, రాయితీ 10%

3) యూనిట్ ధర రూ.1,00,001 నుండి రూ.2,00,000/- వరకు 80% రాయితీ 20%

4) యూనిట్ ధర రూ.2,00,001 నుండి రూ.4,00,000/- వరకు 70% రాయితీ 30%

5) దుర్బల (బలహీన) సమూ హం(రూ.1,00,000/- వరకు)
100% (90% విత్ 10% ఫ్రమ్ ఈఎం ఫ్ )

6) చిన్న నీటిపారుదల (మైనర్ ఇరిగేషన్) 100%

మిగతా వివరాలకు జిల్లా బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక



**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగ నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.శనివారం వేములవాడ పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగ నిలుస్తాయని పేర్కొన్నారు..

# పెద్దూరులో మహిళలకు చీరల పంపిణీ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఎనిమిది, తొమ్మిదవ వార్డు పేద మహిళలకు స్వర్గీయ చిట్నేని ఆగమ్మ నర్సింగరావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు చిట్నేని వెంకటేశ్వరరావు మాధవి దంపతులు ఉగాది పర్వదినం సందర్భంగా చీరలు పంపిణీ చేయమని పంపారు. చీరలను పెద్దూరు గ్రామములోని ఎనిమిదవ వార్డు 9వ వార్డు ప్రజలకు 8వ వార్డు మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి కమలాకర్ రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరిసిల్ల వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వేల్మూల స్వరూప తిరుపతిరెడ్డి, 8వ వార్డు మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి కమలాకర్ రావు రాగా వారి చేతుల మీదుగాపంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి సహకరించిన చిట్నేని వెంకటేశ్వరరావు మాధవి దంపతులకు మేము మా యొక్క పెద్దూరు గ్రామ ప్రజలు సదా మీకు రుణపడి ఉంటామని మాజీ 8వ వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి కమలాకర్ రావు తెలియజేసినారు ఈ రోజులలో బ్రతికి ఉండగానే కన్న తల్లిదండ్రులను చూసుకొని రోజులలో వారు చనిపోయిన వారి అమ్మానాన్నల జ్ఞాపకార్థం ప్రజలకు ఇటువంటి కార్యక్రమాలు చేయడం వారి దయార్థ హృదయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రాకం రమేష్ మరియు ఉలిచే లక్ష్మీనారాయణ, తిప్పవరం నరసయ్య, రాకం సుదర్శన్, సిరికోటి తిరుపతి మరియు కాసారం ఎల్లయ్య, తిమ్మనగరం శ్రీనివాస్, తిప్పవరం ఆనందం, రెడ్డి మల్ల ప్రకాష్, రెడ్డి మల్ల ప్రణీతలు పాల్గొన్నారు. అడుగగానే గౌస్ వారి యొక్క ఫంక్షన్ హాలును ఇచ్చినందుకు వారికి పెద్దూరు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

# యూనివర్సిటీ విద్యార్థుల పై పోలీసుల చర్యలు అమానుషం..

**కవరేజ్ కీ వెళ్లిన మీడియా పై పోలీసుల దాడి హేయనీయం**

**కంచర్ల రవి గౌడ్**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులపై పండుగ పూట పోలీసులు అత్యుత్సాహం చూపించారని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాలను చదును చేసేందుకు వచ్చిన అధికారులు. వందలాది మంది పోలీసుల పహారాలో పదుల సంఖ్యలో జేసీబీలతో పనులను అడ్డుకున్న విద్యార్థులను లాఠీలతో గొడ్లను బాదినట్టు కొట్టరు అని ఖాకీలు బట్టలు చిరుగుతున్నా గౌరగౌర లాక్కెళ్లి వాహనాల్లో పడేస్తూ వీరంగం సృష్టించారు అని 200 మందికి పైగా విద్యార్థులను అరెస్ట్ చేసి సిటీలోని పలు ఠాణాలకు తరలించారు అని ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని దీని పూర్తి బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వనిదని అన్నారు. యూనివర్సిటీ ఎదుట బైఠాయించిన విద్యార్థులను విడుదల చేసేదాకా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం విద్యార్థుల పక్షాన పోరాడుతుందని తమ యూనివర్సిటీ భూములను కాపాడుకోవాలనుకున్న పాపానికి హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులపై రేవంత్ సర్కారు విరుచుకుపడిందని పండుగ పూట పోలీసులతో వీపులు పగులగొట్టించిందని అడ్డువచ్చిన విద్యార్థినల్లా లాఠీలతో గొడ్డును బాదినట్టు బాదుతూ కాళ్లు, చేతులు బంధిస్తూ.. జుట్టుపట్టి జంతువుల్లా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఠాణాలకు తరలించడం చాలా సిగ్గుచేటని బట్టలు చిరిగిపోతున్నాయని ఆడపిల్లలు రోదిస్తున్నా పట్టించుకోకుండా గుంజుకెళ్లారని ఇదేనా ఇందిరమ్మ పాలన ఇదేనా ప్రజాపాలన అని మండిపడ్డారు.

విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే పెట్టుకొని విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఇదంతా రేవంత్ రెడ్డి కనుసన్నల్లో జరుగుతుందని ఎన్నికల్లో విద్యార్థులను అడ్డుపెట్టుకొని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి ఇపుడు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రభుత్వ భూములను అమ్ముకోవాలని చూస్తున్నారని ఆ సంఘటన కవరేజీ కి వెళ్ళిన మీడియా పైన కూడా పోలీసులతో దాడి చేయడం కూడా సిగ్గుచేటని ఇప్పటికీ అయిన ముఖ్యమంత్రి మీరు చేసే చిల్లర పనులను వెనక్కి తీసుకోవాలి అని లేక పోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపుడుతం అని విద్యార్థులకు పూర్తి మద్దతు బీఆర్?ఎస్? ఇస్తుందని వారికి న్యాయం జరిగేంత వరకూ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, ముగ్దం అనిల్, వెంకటేష్, అడిచెర్ల సాయి, రాజు, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముంబై ఇండియన్స్ గెలుపు



- 8 వికెట్ల తేడాతో కేకేఆర్‌పై విజయం
- రెండు ఓటముల తర్వాత గెలిచిన ముంబై ఇండియన్స్

**బలగం టీవీ, ముంబై**

వరుసగా రెండు మ్యాచ్ లలో ఓడిపోయి తీవ్ర ఒత్తిడిలో ఉన్న ముంబయి ఇండియన్స్ మూడో మ్యాచ్‌లో విజయాన్ని అందుకుంది. ముంబయిలోని వాంఖెడే స్టేడియంలో కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో ఘనంగా నెగ్గింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 16.2 ఓవర్లలో 116 పరుగులకు కుప్పకూలింది. అంగ్‌క్రిష్ రఘువంశీ(16 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26), రమణ్‌దీప్ సింగ్(12 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ముంబై బౌలర్లలో అశ్వని కుమార్(4/24) నాలుగు వికెట్లు తీయగా.. దీపక్ చాహర్(2/19) రెండు వికెట్లు పడగొట్టాడు. ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్యా, విఘ్నేష్ పుతుర్, మిచెల్ సాంట్నర్ తలో వికెట్ తీసారు.

అనంతరం ముంబై ఇండియన్స్ కేవలం 12.5 ఓవర్లలోనే 2 వికెట్లకు 121 పరుగులు చేసి గెలుపొందింది. రోహిత్ శర్మ(12), విల్ జాక్స్(16) విఫలమైనా.. ర్యాన్ రికెల్టన్(41 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 62 నాటౌట్), సూర్యకుమార్ యాదవ్(9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 27 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశారు. కేకేఆర్ బౌలర్లలో ఆండ్రీ రస్సెల్(2/235) రెండు వికెట్లు దక్కాయి. ముంబయి ఇన్నింగ్స్ లో ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన రోహిత్ శర్మ మరోసారి తన పేలవ ఫామ్ ను చాటుకుంటూ 13 పరుగులకే వెనుదిరిగాడు. ఈ భారీ విజయం ముంబై ఇండియన్స్ నెట్ రన్‌రేట్‌ను కూడా భారీగా మెరుగుపర్చుకుంది.

అరంగేట్ర యువ పేసర్ అశ్వనీ కుమార్(4-24) విజృంభణతో కోల్‌కతా కోలుకోలేకపోయింది. తన తొలి బంతికే అజింక్యా రహానేను ఔట్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచిన అశ్వని కుమార్.. తన రెండో ఓవర్‌లో డేంజరస్ రింకూ సింగ్‌తో పాటు మనీష్ పాండేను పెవిలియన్ చేర్చాడు. మూడో ఓవర్‌లో విధ్వంసకర బ్యాటర్ ఆండ్రీ రస్సెల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో అరంగేట్ర ఐపీఎల్ మ్యాచ్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.



# అక్టోబర్‌లో ఆస్ట్రేలియా టూర్‌కు భారత్



**బలగం టీవీ, హైదరాబాద్**


ఈ ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియా టూర్‌కు భారత్ వెళ్లనుంది. అక్కడ టీమ్‌ఇండియా ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా 2025-26కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 19 నుంచి మొదలుకాబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 23న ముగియనుంది. వన్డే సిరీస్ ముగిసిన తర్వాత అక్టోబర్ 29 నుంచి నవంబర్ 08 దాకా ఐదు టీ20లను నిర్వహించనున్నారు. మూడు వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లు కాగా టీ20 సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు రాత్రే జరుగుతాయి. పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో వన్డేలు జరుగనుండగా. కాన్‌బెర్రా, మెల్‌బోర్న్, హెూబర్ట్, గోల్డ్‌కోస్ట్, బ్రిస్బేన్‌లలో టీ20లు నిర్వహించనున్నారు. సెప్టెంబరులో జరిగే ఆసియాకప్ తర్వాత భారత జట్టు ఆసీస్ టూర్‌కు వెళ్లనుంది.

పురుషులతో పాటు భారత మహిళల జట్టు సైతం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. 2026 ఫిబ్రవరి-మార్చిలో భారత్..ఆసీస్‌తో 3 టీ20లు, 3 వన్డేలు, ఒక టెస్టు ఆడనుంది. ఫిబ్రవరి 15-21 మధ్య టీ20 సిరీస్ జరగాల్సి ఉండగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 01 దాకా వన్డే సిరీస్ జరుగనుంది. మార్చి 6 నుంచి పెర్త్‌లోని వాకా మైదానంలో ఏకైక టెస్టు (పింక్) ఆతిథ్యమివ్వనుంది.

## ఆకట్టుకుంటున్న జాక్ రంజాన్ స్పెషల్ లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం జాక్. ఈ చిత్రానికి బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ ఈ సారి ఫకీర్ బాబా అవతారమెత్తి.. తనదైన స్టైల్ గెటప్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. జాక్.. ఇది కేవలం ఒక పేరు కాదు.. ఇది ఒక వైబ్.. ఇంకా ఛేదించాల్సిన మిస్టరీ.. జాక్ టీం నుంచి అందరికీ ఈద్ ముబారక్ అంటూ షేర్ చేసిన లుక్ నెట్టింట వైరల్‌గామారింది.







## అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

యాంకర్ ప్రదీప్ మాచిరాజు '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో హీరోగా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే రెండో మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా తాజాగా మేకర్స్ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే ఓ సివిల్ ఇంజనీర్ ఒక పల్లెటూరికి ఓ ప్రాజెక్టు పని మీద వెళతాడు. అక్కడ తాపీ పని వాళ్లతో, ఆ ఊరి వాళ్లతో ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు అనేది చూపించారు. అలాగే ఆ ఊర్లో ఒకే ఒక్క అమ్మాయి ఉండటం, ఆ అమ్మాయితో హీరోకి లవ్, పెళ్లి వంటి ఆసక్తికర కథనంతో సినిమా ఉండబోతుందని తెలుస్తుంది. జబర్దస్త్ కామెడీ షోతో పేరు తెచ్చుకున్న డైరెక్టర్స్ నితిన్, భరత్‌ల దర్శకత్వంలో, మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ పై ఈ సినిమా తెరకెక్కింది. ప్రదీప్ సరసన దీపికా పిల్లి హీరోయిన్‌గా నటించారు. రధన్ సంగీతం అందించారు.

## నేను తెలుగు సినిమాలు చూస్తా : హసరంగా

**బలగం టీవీ, హైదరాబాద్**



తాను తెలుగు సినిమాలు చూస్తానని శ్రీలంక స్టార్ స్పిన్నర్, రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ వానిందు హసరంగా తెలిపారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హసరంగా (4/35) అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అయితే వికెట్ తీసిన ప్రతీసారి పుష్ప ఐకానిక్ 'తగ్గేదేలే'స్టైల్‌లో హసరంగా సంబరాలు చేసుకున్నాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హసరంగాను.. పుష్ప సెలెబ్రేషన్స్ గురించి ప్రశ్నించగా.. తాను తెలుగు, తమిళం, మళయాళం సినిమాలు చూస్తానని వెల్లడించాడు. 'బేసిక్స్ తగ్గట్లు నేను బౌలింగ్ చేశాను. స్టంప్ లైన్‌తో పాటు ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ లైన్‌లో బంతులు వేసాను. మా బ్యాటర్లు భారీ లక్ష్యాన్ని నమోదు చేయడంతో మా పని సులువైంది. రుతురాజ్ గైక్వాడ్‌ను ఔట్ చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. అతను డేంజరస్ బ్యాటర్. అతను ఔటవ్వకుంటే.. మ్యాచ్‌ను మా నుంచి లాగేసేవాడు. మా ఫీల్డర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. శివమ్ దూబే, రుతురాజ్ గైక్వాడ్ ఇచ్చిన క్యాచ్‌లు అద్భుతంగా అందుకున్నారు. వికెట్ తీసినప్పుడు పుష్ప స్టైల్‌లో సంబరాలు చేసుకోవడం నచ్చింది. భారత్‌లో నేను తెలుగు, మలయాళంతో పాటు తమిళ సినిమాలు చూస్తుంటా. మరీ ముఖ్యంగా పుష్ప సినిమాను చాలా సార్లు చూశాను. అందుకే అలా సంబరాలు చేశాను.'అని చెప్పుకొచ్చాడు.



## దూరదర్శని నుంచి 'నా నీడ వెళుతుందా' లిరికల్ వీడియో విడుదల


**బలగం టీవీ, హైదరాబాద్**

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శని' . కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నా నీడ వెళుతుందా' అనే లిరికల్ వీడియోను విడుదల చేశారు. అనురాగ్ కులకర్ణి, సునీత ఆలపించిన ఈ బ్యూటిఫుల్‌సాంగ్‌కు నారాయణ ఆవుల సాహిత్యం అందించారు. ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు.

## ముళ్లపూడి బ్రహ్మానందం కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**

నిర్మాత ముళ్లపూడి బ్రహ్మానందం(68) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ముళ్లపూడి బ్రహ్మానందం బావ అవుతారు. ఈవీవీ సోదరిని ఆయన పెళ్లి చేసుకున్నారు. తెలుగులో ముళ్లపూడి పలు చిత్రాలను నిర్మించారు.ఆస్ట్రేలియాలో ఉంటున్న ఆయన కుమారుడు వచ్చిన తర్వాత బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.




## నిర్మాతగా సమంత తొలి చిత్రం 'శుభం' టీజర్..

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి కూడా అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. 'త్రాలాలా మూవింగ్ పిక్షర్స్' పేరుతో ఆమె సొంత ప్రొడక్షన్ హౌస్ ను స్థాపించింది. ఈ సంస్థ నుంచి తొలి చిత్రంగా 'శుభం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ ను విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే ఈ సినిమాలో కామెడీతో పాటు హారర్ కూడా ఉన్నట్టుగా అనిపిస్తోంది. శోభనం గదిలో భార్యాభర్తల మధ్య సరదా సంభాషణతో టీజర్ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత పెళ్లికూతురు రిమోట్ తీసుకుని టీవీ ఆన్ చేస్తుంది. ఈ టైమ్ లో సీరియల్ చూడటం ఏమిటని పెళ్లికొడుకు అనగానే... పెళ్లి కూతురు 'ష..' అంటూ సీరియస్ గా చూస్తుంది.